క్లుప్తంగా

'స్పందన'కు 10 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 10 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని తహసీల్దార్ శ్రీరామమూర్తి స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డీటీ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు ఐదు వినతులు


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురం జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఐదు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టౌన్ ప్లానింగ్‌కు 2, ఇంజినీరింగ్‌కు 1, యూసీడీకి 1, రెవెన్యూ విభాగానికి 1 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1, 2, టీఎస్ఎస్ రాజు, ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్ఎస్ జనార్దనరావు, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి, ఈఈ వాటర్ సప్లై సూరిశెట్టి శేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా కలియుగ వెంకన్న ఆలయ వార్షికోత్సవం


స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న నరేష్‌కుమార్ దంపతులు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం తిక్కవానిపాలెంలోని కలియుగ వేంటేశ్వర స్వామి ఆలయ 29వ వార్షికోత్సవాన్ని సోమవారం గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఎస్‌కేడీ ఫైనాన్షియల్ అధినేత చల్లపల్లి నరేష్‌కుమార్, అన్నపూర్ణాదేవి దంపతులు వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవానికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామకృష్ణశర్మ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. సాయంత్రం నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షుడు మెరుగు నూకరాజు, ప్రధాన కార్యదర్శి పట్టిమీ రాజు, గుంటు నాగరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

మల్కాపురం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ముప్పిడి గగన దీపిక(14) అనే బాలిక ఇటీవల కంచరపాలెం దుర్గానగర్‌లోని అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో అమ్మమ్మ ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తన కుమార్తె కనిపించడం లేదని మల్కాపురం మహారాణి వీధిలో ఉంటున్న బాలిక తల్లి ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చని ఆలయ వర్గాలు తెలిపాయి.

ప్రగతి కాంతులు



- 43వ వార్డులో రూ.8.50 కోట్లతో అభివృద్ధి పనులు
- యూపీహెచ్‌సీ ఏర్పాటుతో చెంతనే వైద్య సదుపాయం
- రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో కష్టాలకు చెక్
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు


మాదేటి గార్డెన్స్‌లో నిర్మించిన బాక్స్ కల్వర్టు


43వ వార్డు జగన్నాథపురంలో నిర్మిస్తున్న రెండంతస్తుల దోబీఖానా

సీతంపేట: గత టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో జీవీఎంసీ 43వ వార్డు అభివృద్ధికి దూరంగా నిలిచిపోయింది. రహదారులు, డ్రెయిన్లు, గెడ్డలు అధ్వానంగా ఉండేవి. వార్డులో ఆస్పత్రి అందుబాటులో లేక చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు సైతం కేజీహెచ్‌కు పరుగులు పెట్టాల్సి వచ్చేది. శ్రీనివాసనగర్‌కు రోడ్ కనెక్టివిటీ లేక ఏళ్ల తరబడి స్థానికులు ఇబ్బంది పడ్డారు.

ఈ సమస్యలన్నింటినీ అధిగమించేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో 43వ వార్డులో గడిచిన నాలుగున్నరేళ్లలో సుమారు రూ.6.32 కోట్లతో డ్రెయిన్లు, రోడ్లు, కల్వర్టులు, సామాజిక భవనాలు, పార్కులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎలా ఎన్నో అభివృద్ధి చేశారు. ఇటీవల కొత్తగా నిధులు మంజూరు కావడంతో వార్డులో మరికొన్ని అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి.

ప్రస్తుతం జరుగుతున్న పనులు

జీవీఎంసీ 43వ వార్డు 80 అడుగుల రోడ్డులోని బ్రహ్మం గారి ఆలయం వద్ద రూ.41 లక్షలతో రెండంతస్తుల సామాజిక భవనం నిర్మిస్తున్నారు. జగన్నాథపురం శ్మశానవాటిక పక్కన శిథిలావస్థలో ఉన్న దోబీఖానాను తొలగించి, రూ.39 లక్షలతో రెండంతస్తుల్లో దోబీఖానా, సామాజిక భవనం నిర్మిస్తున్నారు. రూ. 20 లక్షలతో యలమంచిలి వారి వీధిలో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మాదేటి గార్డెన్స్‌లో గౌరీ కల్యాణ మండపం వెనుక రోడ్డులో రూ.9 లక్షలతో బాక్సు కల్వర్టు నిర్మాణం పూర్తి చేశారు. జగన్నాథపురంలో 240 సచివాలయం భవనానికి రూ.11 లక్షలతో మరమ్మతులు, పెయింటింగ్ పనులు చేపట్టారు.

రూ.48.90 లక్షల మంజూరు

వార్డులోని కర్రివాని బ్రిడ్జి నుంచి రామాలయానికి వెళ్లే మార్గంలో ఉన్న బ్రిడ్జి శిథిలమవడంతో కొత్తదాని నిర్మాణానికి రూ.48.90 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం టెండర్ దశలో ఉంది. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ బ్రిడ్జి నిర్మించి సుమారు 30 ఏళ్లు గడిచిపోయాయి. ఎప్పుడు కూలిపోతుంతోనన్న భయంతో స్థానికులు సమస్యను కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ దృష్టికి తీసుకురావడంతో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి రూ.48.90 లక్షల నిధులు మంజూరు చేయించారు. శ్రీనివాసనగర్ పార్కు పక్కన ఉన్న జగన్నాథపురం బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరు కాగానే బ్రిడ్జి నిర్మించనున్నారు. సుమారు రూ.8.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి వార్డును ప్రగతి పథంలో నడిపిస్తుండటంతో స్థానికులు హర్షం చేస్తున్నారు.


యలమంచిలి వారి వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు కమ్ డ్రెయిన్

రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నారు



యలమంచిలి వారి వీధిలో చిన్న చిన్న సందులు ఉన్నాయి. కాలువలు, రోడ్లు సరిగా లేక చాలా ఏళ్ల నుంచి ఇబ్బంది పడుతున్నాం. వార్డు పర్యటనలో కార్పొరేటర్ ఉషశ్రీ దృష్టికి సమస్యలు వివరించాం. వెంటనే నిధులు మంజూరు చేయించి సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– రాజగిరి భారతి, యలమంచిలి వారి వీధి

ప్రతి ప్రాంతంలో అభివృద్ధి



వార్డులోని ప్రతి ప్రాంతంలో తారురోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు. ఆరోగ్య కేంద్రం, సామాజిక భవనాలు అందుబాటులోకి తెచ్చారు. శ్రీనివాసనగర్ గెడ్డపై విశాలంగా బ్రిడ్జి నిర్మించారు. వెంకటేశ్వర కాలనీ జీవీఎంసీ స్కూల్‌ను అభివృద్ధి చేశారు. దోబీఖానా నిర్మిస్తున్నారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తున్నారు.

– వి.సత్యనారాయణ, జగన్నాథపురం

అన్ని విధాల వార్డు అభివృద్ధి



గత నాలుగున్నరేళ్లలో వార్డులో సుమారు రూ.8.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టాం. నేను కార్పొరేటర్‌గా రాక ముందు వార్డులో రోడ్లు, డ్రెయిన్లు, సరైన మౌలిక వసతులు లేక అధ్వానంగా ఉండేది. ఇపుడు ప్రతి ఏరియాలో రోడ్లు, డ్రెయిన్లు, సామాజిక భవనాలు, కల్వర్టులు, బ్రిడ్జిలు, పార్కులు నిర్మించాం. శ్రీనివాసనగర్‌కు రోడ్ కనెక్టివిటీ కల్పించాం. ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశాం.

– పెద్దిశెట్టి ఉషశ్రీ, కార్పొరేటర్, 43వ వార్డు

రెచ్చిపోతున్న రౌడీషీటర్లు

- పోలీసులపై తిరగబడిన ఘటన
- ఫోర్త్ టౌన్ పీఎస్‌లో కేసు నమోదు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారు. పోలీస్‌లపైనే తిరగబడుతున్న సంఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రతి ఆదివారం రౌడీషీటర్లకు తూతూ మంత్రంగా కౌన్సెలింగ్ చేయడం, అనంతరం వారితోనే నోట్‌బుక్‌లో సంతకాలు పెట్టించడం, స్టేషన్‌లో పనులు చేయిస్తుండటంతో అదే అదునుగా చూసుకొని కొందరు హద్దు మీరుతున్నారు. తాజాగా ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక బార్ వద్ద పోలీసులపై రౌడీషీటర్ తిరగబడిన సంఘటనే ఇందుకు నిదర్శనం. ఆదివారం రాత్రి నరసింహనగర్‌లోని అమెరికన్ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఓ రౌడీషీటర్ వీరంగం సృష్టించాడు. ఆదివారం రాత్రి విధుల్లో ఉన్న ఫోర్త్‌టౌన్ సిబ్బంది సమయం దాటిపోవడంతో బార్ క్లోజ్ చేయాలని చెప్పారు. దీంతో అక్కడే మద్యం తాగుతున్న రేవ్ శ్రీనివాసరావు పోలీసులపై దాడి చేసి దుర్భాషలాడాడు. అక్కడే ఉన్న రాఘవేంద్రస్వామి అనే వ్యక్తిని చిదగబాదడంతో చిన్నపాటి గాయాలపాలయ్యాడు. రాఘవేంద్ర స్వామి ఫిర్యాదు మేరకు 307, 324, 323, 506 సెక్షన్ల కింద సీఐ విజయకుమార్ కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

11న బహిరంగ సభ

తాటిచెట్లపాలెం: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొంప గోవిందరాజు ఆధ్వర్యంలో సోమవారం టీపీఎస్ కాలనీలోని సింకా గ్రాండ్ హోటల్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల నాయకుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి పి.రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 11న విశాఖలో 50 వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులంతా సమాయత్తం కావాలని పిలుపినుచ్చారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల ముఖ్య నాయకులు, కాంగ్రెస్ తరపున ఎన్నికల్లో పోటీ చేయనున్న ఎమ్మెల్యే అభ్యర్థులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై రాజకీయ నాయకులతో సమావేశం


పార్టీల నాయకులతో చర్చిస్తున్న ఉత్తర ఎన్నికల అధికారి అఖిల

సీతమ్మధార: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పలు రాజకీయ పార్టీల నాయకులతో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల అధికారి, డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల సమావేశం నిర్వహించారు. రాబోవు ఎన్నికల నేపథ్యంలో 58, 88, 270 పోలింగ్ బూత్‌లకు సంబంధించి వారికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1500 ఓటర్లు ఉన్న బూత్‌లను రెండు బూత్‌లుగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి బూత్‌లో కల్పించనున్న సౌకర్యాలపై ఆరా తీశారు. రెండు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ప్రశాంతంగా, సులభంగా తమ ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరామమూర్తి, డీటీ త్రినాథ్, అధికారులు పాల్గొన్నారు.

7న జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 7వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. హీరో మోటర్స్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థల్లో 140 ఉద్యోగాలకు భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ట్రైనీ, జూనియర్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, ప్రొడక్షన్ అసెంబ్లీ, ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ పూర్తిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తిరుపతి ప్రాంతాల్లో జాబ్ లోకేషన్ ఉంటుందన్నారు. ఆయా ఉద్యోగాన్ని బట్టి జీతం నెలకు రూ.10,000 - రూ.18,000 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

11న మేజిస్టీరియల్ విచారణ

మహారాణిపేట: విశాఖ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 6న కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ చనిపోయిన అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం, రూడకోట పంచాయతీ, బడంబీరు గ్రామానికి చెందిన కోడ పోతన్న మరణాన్ని లాకప్ డెత్‌గా పరిగణించి మేజిస్టీరియల్ విచారణకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 11న విశాఖ కలెక్టరేట్‌లోని ఆర్డీవో కార్యాలయంలో విచారణ నిర్వహించనున్నట్లు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. కోడ పోతన్న సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో అనారోగ్యానికి గురయ్యారని, ఫిబ్రవరి 6న చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించగా, అదే రోజు మధ్యాహ్నం మృతి చెందాడని వివరించారు. పోతన్న మరణానికి సంబంధించిన వివరాలు తెలిసినవారు విచారణకు హాజరై లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

'ఐడియల్ గంధర్వ' లోగో ఆవిష్కరణ

దాబాగార్డెన్స్: ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్టు, ఘంటసాల స్మారక పీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ టి.శరత్ చంద్ర ఆధ్వర్యంలో ఐడియల్ గంధర్వ లోగో ఆవిష్కరణ జరిగింది. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సినీ నటుడు సుమన్, జి.దాము లోగోను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ శరత్‌చంద్ర సంగీత సారథ్యంలో పలువురు గాయనీ గాయకులు ఘంటసాల ఆలపించిన తెలుగు సినీగీతాలను మధురంగా ఆలపించారు. అమెరికాకు చెందిన అంతర్జాతీయ స్థాయి స్వరపోషకుడు జి.రాముకు జీవిత సాఫల్య పురస్కారాన్ని నటుడు సుమన్ చేతుల మీదుగా అందజేశారు. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి ధ్వని అనుకరణతో ప్రేక్షకుల మన్ననలు పొందారు. ఘంటసాల స్మారక పీఠం స్వర పోషకుడు ఎమ్మెస్ రాజు, వంకాయల సన్యాసిరాజు, తదితర కళాభిమానులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరికి రిమాండ్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. బిహార్‌కు చెందిన లాలం కుమార్ యాదవ్ అనే వ్యక్తి చెన్నైలోని ఓ టీ షాపులో పనిచేస్తున్నాడు. అతడికి మరో టీ షాపులో వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతడు కుమార్ యాదవ్‌తో మంతనాలు జరిపి అరకు ప్రాంతానికి వెళ్లి గంజాయి తీసుకొస్తే రూ.3 వేల ఇస్తానన్నాడు. అరకు వెళ్లేందుకు ట్రైన్ టికెట్లు తీస్తానని చెప్పి దారి ఖర్చుల కోసం రూ.1000 రూపాయలు ఇస్తానని చెప్పడంతో కుమార్ యాదవ్ ఒప్పుకున్నాడు. దీంతో చెన్నై నుంచి బయలుదేరి విశాఖ వచ్చిన కుమార్‌ను రైల్వే స్టేషన్‌లో అరకుకు చెందిన మధ్యవర్తి వచ్చి అరకు తీసుకెళ్లాడు. అక్కడ నాలుగు కిలోల గంజాయి కొని లాలం కుమార్ యాదవ్‌కు రెండు ప్యాకెట్లుగా తయారు చేసి అందజేశాడు. నాలుగు కిలోలకు సంబంధించిను నగదును ఫోన్‌పే ద్వారా చెన్నైలో ఉన్న వ్యక్తి పంపించాడు. అరకు నుంచి గంజాయి తీసుకొచ్చిన కుమార్ యాదవ్ విశాఖ రైల్వే స్టేషన్ దరి అనుమానాస్పదంగా కనిపించడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నాలుగు కిలోలు గంజాయి తరలిస్తున్నట్లు చెప్పడంతో నిందితుడిని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. సీఐ ఎస్.విజయకుమార్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఫిఫ్త్ టౌన్ పీఎస్ పరిధిలో..

మల్కాపురం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.

వివరాలిలా.. పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా ఆదివారం ఉదయం కంచరపాలెం మెట్టు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న కేరళకు చెందిన ఆస్కార్ అలీ అనే వ్యక్తి అరకు నుంచి గంజాయిని తరలిస్తున్న క్రమంలో అతడిని పట్టుకున్నారు. 1.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఆదివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ రవికుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు


బ్రీత్ ఎన్‌లైజర్ టెస్ట్ చేస్తున్న ఎస్ఐ భాస్కరరావు, సిబ్బంది

సీతమ్మధార: మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.భాస్కరరావు హెచ్చరించారు. గురుద్వారా, ఆశీలమెట్ట తదితర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ద్వారకా ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పలువురు యువకులను గుర్తించి బ్రీత్ ఎన్‌లైజర్ టెస్టులు చేశారు. అధిక మోతాదులో మద్యం తాగిన వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ భాస్కరరావు మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాన్ని నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉండాలని, లేనిపక్షంలో జరిమానా విధించి, చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు ఎవరూ వాహనాలు ఇవ్వరాదని సూచించారు.

సులభ్ కాంప్లెక్స్ ప్రారంభం


సులభ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు


శ్రామికనగర్‌లో కొత్తగా నిర్మించిన సులభ్ కాంప్లెక్స్

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు అక్కయ్యపాలెం హైవే పక్కన శ్రామికనగర్‌లో సుమారు రూ.14 లక్షలతో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌ను సోమవారం ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రామికనగర్‌లో రోడ్డు పక్కన షెడ్లల్లో నివసిస్తున్న కుటుంబాల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని సులభ్ కాంప్లెక్స్ నిర్మించినట్లు తెలిపారు. వార్డులోని ప్రతి ప్రాంతంలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని ఇచ్చే విధంగా మొక్కల మధ్య వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా అభివృద్ధి చేశామని చెప్పారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ రవణమ్మ, కన్వీనర్లు ఆదినారాయణ, పి.గోపి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి


కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగరంలో కాలుష్యం తగ్గించవచ్చని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీ కార్యాలయానికి సోమవారం ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు.

ఎకో - వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు అనేక చర్యలు చేపడతున్నామన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని కోరారు.

బహుజనుల రాజ్యాధికారమే బీఎస్పీ మేనిఫెస్టో



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త పూర్ణచంద్రరావు

సీతంపేట: బహుజనుల రాజ్యాధికారమే బహుజన సమాజ్‌పార్టీ మేనిఫెస్టో అని, రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేస్తోందని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర సమన్వయకర్త, మాజీ ఐపీఎస్ అధికారి పూర్ణచంద్రరావు అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రెండుకులాల మధ్య, రెండు పార్టీల మధ్య విపరీతమైన సంఘర్షణ వాతావరణం ఉందని, కొన్ని వేల కోట్లతో రాజకీయ వ్యాపారం జరుగుతోందన్నారు. రాజకీయ పార్టీలు ఓట్లను ఎలా కోట్లుగా మార్చుకుంటున్నారో బహుజనులు గుర్తించాలన్నారు. లకే రాజారావు ఆదర్శవంతమైన నాయకుడని, ఆయనే అందరికీ స్ఫూర్తి అని అన్నారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేస్తున్న బీఎస్పీని అభ్యర్థులను బహుజనులంతా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, రాష్ట్ర కార్యదర్శి కదిరి రాము, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.తిరుపతిరావు, ప్రకాష్, శివప్రసాద్, బోని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదు

మల్కాపురం: ఒక వ్యక్తి తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో డిగ్రీ విద్యార్థిని ఫిర్యాదు చేసింది. వివరాలిలా.. టౌన్ కొత్తరోడ్డు చెంగలరావుపేటలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న సూరాడ మానస ఊర్వశి జంక్షన్ వద్ద గల గౌరీ డిగ్రీ కాలేజీలో ఫస్టియర్ చదువుతోంది. పరవాడ మండలం దేశపాత్రునిపాలేనికి చెందిన రాము అనే వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడింది. కొంతకాలం నుంచి అతడి ప్రవర్తన బాగోలేక దూరం పెట్టింది. ఈ క్రమంలో తనను ప్రేమ పేరుతో బెదిరిస్తున్నాడని విద్యార్థిని ఫిర్యాదులో పేర్కొంది. ఈ నెల 2న తన కాలేజీ వద్దకు వచ్చి ఇలాంటి దుస్తులు ధరించవద్దంటూ వాటిని చించేసి తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని మానస సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఉమెన్ ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యూజీడీ లీకుతో అవస్థలు


శ్రీనివాసనగర్‌లో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని దాడి రామ్మూర్తి కల్యాణ మండపం వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. మురుగు నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుండటంతో ఇక్కడి ఆరోగ్య కేంద్రానికి, సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఇబ్బంది పడుతున్నారు. గతంలో మరమ్మతులు చేశారని, రెండు రోజులకే సమస్య మళ్లీ మొదలైందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.